క్లుప్తంగా

రేవు ప్రయాణాన్ని పునరుద్ధరించాలి

అల్లవరం: వరద ఉధృతి కారణంగా పదిహేను రోజులుగా నిలిచిపోయిన ఓడలరేవు-కరవాక, బెండమూర్లంక-గోగన్నమఠం రేవులను తక్షణమే తెరవాలని ఇంజనీరింగ్ విద్యార్థులు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. గొల్లపాలెం, తూర్పుపాలెం, కేశనపల్లి, పడమటిపాలెం, శంకరగుప్తం, గోగన్నమఠం, మగటపల్లి, పొనమండ, ఆదుర్రు తదితర గ్రామాల నుంచి సుమారు 200 మంది వరకు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలకు వస్తున్నామని వారు తెలిపారు. రేవు ప్రయాణాన్ని నిలిపివేయడంతో ప్రతి రోజు 90 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని విద్యార్థులు తెలిపారు. తక్షణమే అధికారులు చొరవ చూపి పడవల్లో రాకపోకలకు అనుమతివ్వాలని విద్యార్థులు కోరారు.

పుస్తకాలు చదవడం ద్వారానే విజ్ఞానం

యానాం: సమాజంలో ఆధునిక దేవాలయాలుగా విరాజిల్లుతున్న గ్రంథాలయాల ద్వారానే పూర్తి విజ్ఞానం అలవడుతుందని, పాఠకుడికి అవసరమైన పుస్తకాలు అందించడంలో లైబ్రేరియన్లు కీలకపాత్ర వహిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్‌ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ శాస్త్రపిత ఎస్‌ఆర్ రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని లైబ్రేరియన్ కె రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన జాతీయ లైబ్రేరియన్స్ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతకముందు రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అధ్యాపకులు శాంతికుమార్, యోగేందర్‌సింగ్, టి ప్రసాదరావు, నరేష్, రామకృష్ణ, విజయసాగర్, ఎస్ శ్రీనివాస్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఫర్నీచర్ బహూకరించిన పూర్వ విద్యార్థులు

ఐ.పోలవరం: ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వపు విద్యార్థులు ఫర్నీచర్ బహూకరించారు. 1989–90లో చదువుకున్న విద్యార్థులు రూ.1.60 లక్షల విలువైన ఎనిమిది బీరువాలు, ఐదు ఎస్ చైర్లు, ఒక రివాల్వింగ్ చైర్‌ను సోమవారం అందించారు. పాఠశాల తరపున హెచ్‌ఎం వీధి సురేష్ బాబు వీటిని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలపై అభిమానంతో పూర్వపు విద్యార్థులు ఫర్నీచర్ అందించడం అభినందనీయమన్నారు. పూర్వపు విద్యార్థులు తుమ్మూరి బాపిరాజు, అకొండి కామేశ్వరరావు, విజ్జపు శ్రీనివాసరావు, రమేశ్వరపు శేషగిరి పాల్గొన్నారు.

ఇసుక సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అమలాపురం రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్‌యార్డు వద్ద స్థానిక మండల పరిధిలోని వారికి మాత్రమే ఇసుక ఇస్తూ దూర ప్రాంతాల డ్రైవర్లకు కేటాయించడం లేదని అల్లవరం మండల కనకదుర్గా ట్రాక్టర్ డ్రైవర్లు, వానర్ల సంఘం సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్టాక్ పాయింట్ల వద్ద ప్రభుత్వం నిబంధనలకు లోబడి ఇసుక సరఫరా చేస్తూ తద్వారా వచ్చే ఆదాయంతో సుమారుగా 50 మంది ట్రాక్టర్లు నడుపుతూ డ్రైవర్లతో కలిసి కొంతకాలంగా జీవనోపాధి పొందుతున్నామని రెళ్ల బాలకృష్ణ, నాగ భూషణం, పి. సత్యనారాయణ తెలిపారు. దీనిపై కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వారు వినతిపత్రం అందించారు. ఇతర ప్రాంతాల వారిపై వివక్ష చూపుతున్నారని వారు తెలిపారు. గోపాలపురం, ఉబలంక, మందపల్లి, కొత్తపేట, బోడిపాలెం, మల్లాయిదొడ్డి వద్ద ఇసుక పాయింట్లు ఉన్నాయి. ఇసుక పాయింట్ల వద్ద లోడింగ్ అనుమతులు కల్పించి న్యాయం చేయాలని వారు కోరారు.

అభివృద్ధికి కృషి చేయాలి

అమలాపురం రూరల్: గ్రామాల్లో అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీలకు పంచాయతీరాజ్ చట్టాలపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో గుబ్బల మల్లికార్జునరావు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

కాట్రేనికోన: కేరళలోని వయనాడ్ వరద బాధితుల సహాయం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో విరాళాలను సేకరిస్తోంది. సీఐటీయూ మండల శాఖ ఆధ్వర్యంలో అంగన్ వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ వెళ్లి విరాళాలను సేకరిస్తున్నారు. మండలంలో కాట్రేనికోన, పల్లంకుర్రు, కందికుప్ప, చెయ్యేరు దొంతికుర్రులో వ్యాపార సంస్థలు, స్థానికుల నుంచి వరద బాధితులకు సహాయం కోసం విరాళాలను సేకరిస్తున్నారు. ఈ విరాళాలను కేరళ ప్రభుత్వం వరద బాధితుల సహాయ నిధికి అందజేస్తామన్నారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

తాళ్లరేవు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం రాత్రి ప్రదర్శించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నాటకం అందరినీ ఆకట్టుకుంది. హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ కళా బృందం అంబేడ్కర్ జీవిత విశేషాలను ప్రదర్శించారు. ఎస్సీ, ఎస్సీ ఎంప్లాయీస్ పలు సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రారంభించారు. దున్నా జనార్దనరావు, వడ్డి ఏడుకొండలు, కాశి రవీంద్ర, ప్రకృతి కుమార్, కెవెస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ గట్లు.. ఆక్రమణదారుల అడ్డా

- కాలువల పొడవునా ఆక్రమ కట్టడాలు
- శాశ్వత భవనాలు, అనధికార వంతెనల నిర్మాణం
- ఆక్రమించిన స్థలాలకు పంచాయతీ నుంచి ఇంటి పన్ను, విద్యుత్ మీటర్లు



పేరూరు వై జంక్షన్లో కాలువను ఆక్రమించి ఏర్పాటు చేసిన రిటైనింగ్ వాల్



బోడసకుర్రు వద్ద ప్రధాన పంట కాలువ పక్కనే నివాసాలు



ఈదరపల్లి పంట కాలువ పక్కన వెలిసిన దుకాణాలు



విలసవిల్లి పంట కాలువ పొడవునా వ్యాపారాలు, ఇళ్లు

అల్లవరం: కోనసీమ ప్రాంతంలోని ప్రజలకు, సర్వ ప్రాణులకు జీవనాధారమైన తాగునీరు పుష్కలంగా లభించేందుకు కారకుడు బ్రిటీష్ ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్. ఈ మహాశయుని కృషి ఫలితంగా శివారు ప్రాంతాలకు సైతం సాగునీరు అంది బీడు భూములన్నీ పంట భూములుగా మారి, ఏడాది పొడవునా ఆహార పంటలు, వాణిజ్య పంటలు పండి రైతులు, ప్రజలు దినాభివృద్ధిని సాధిస్తున్నారు. వ్యవసాయానికి ప్రధానమైన కాలువలు నేడు ఆక్రమణకు గురై కుచించుకుపోతున్నాయి.

అందరి దృష్టి కాలువ గట్లపైనే..

శివారు ప్రాంతాల సాగునీరు, ప్రజల తాగునీటి అవసరాల కోసం నీటిని సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాటుచేసిన కాలువలు నేడు ఆక్రమణలకు గురవుతున్నాయి. కాలువల పొడవునా ఆలయాలు, శాశ్వత కట్టడాలు, భవనాలు, చేపల వ్యాపార సముదాయాల యథేచ్ఛగా వెలుస్తున్నాయి. కాలువ పక్కన కొద్దిపాటి జాగా ఉన్నా రాత్రికి రాత్రే ఆక్రమణకు గురవుతోంది. ఆక్రమణదారుల అడ్డాగా కాలువ గట్లు రూపాంతరం చెందాయి. బతుకుదెరువు కోసం కాలువ ఒడ్డున చిరు వ్యాపారం ప్రారంభించి కాలక్రమేణా కాలువని ఆక్రమించి శాశ్వత భవనాన్ని నిర్మించడం వరకు వెళుతున్నారు. కాలువలపై పర్యవేక్షణ చేసే ఇరిగేషన్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఇరిగేషన్ సిబ్బందికి మామూళ్లు అందించి కాలువని ఆక్రమించుకుని భారీ కట్టడాలు నిర్మించినా వారు పట్టించుకోరనే అభిప్రాయంలో ఆక్రమణదారులున్నారు. ఇదంతా ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్నా ఇరిగేషన్ శాఖలో ఎస్‌ఈ, డీఈ లాంటి అధికారులు కుడా పట్టించుకోవడం లేదు. కాలువని ఆక్రమించుకుని కట్టడాలు నిర్మిస్తున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే స్థానికంగా నాయకులు రంగప్రవేశం చేసి అధికారుల నోళ్లకి తాళం వేస్తారు. అమలాపురం మండలం నడిపూడి లాకు వద్ద ప్రధాన పంట కాలువ చల్లపల్లి కెనాల్, ఇందుపల్లి కెనాల్‌గా విడిపోయింది. చల్లపల్లి కెనాల్ పొడవునా కామనగరువు, సమనస, చల్లపల్లి వరకు కాలువ ఆక్రమణకు గురైంది. కాలువ పొడవునా ఇళ్లు, కట్టడాలు, అనధికారి వంతెనలు అధిక సంఖ్యలో ఉన్నాయి. విలసవిల్లి, భీమనపల్లి, కూనవరం కాలువలపై అనేక వంతెనలున్నాయి.

ఆక్రమ నిర్మాణాలను కన్నెత్తిచూడని అధికారులు

నడిపూడి లాకు నుంచి ఇందుపల్లి మీదుగా బెండమూర్లంక వరకు విస్తరించి బెండా కెనాల్ దారి పొడవునా ఆక్రమణలే, ఎక్కడ చూసిన గుళ్లు, ఇళ్లు, షాపులు యథేచ్ఛగా వెలిశాయి. ఇవి కాకుండా అల్లవరం, గుండెపూడి, గోడితిప్ప, మొగళ్లమూరు, బెండా కాలువ 1, 2 తదితర కాలువలపై ఆక్రమణలున్నాయి. అమలాపురంలో నడిలాకు నుంచి ఇందుపల్లి వరకు కాలువ గట్టు వెంబడి ఆక్రణలు వెలిశాయి. కార్మిక సంఘాలు, వ్యాపారాలు, పాస్టర్లు, చిరు వ్యాపారులు కాలువ గట్టుని ఆక్రమించుకున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రమైన అమలాపురంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు రోజూ ఈ కాలువ వెంబడి తిరుగుతున్నా దీనిపై ఆక్రమణదారులను ప్రశ్నించరు. అధికారుల్లో, ప్రజల్లో మార్పు రానంత వరకు కాలువలు ఆక్రమణలకు గురవుతూనే ఉంటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

> **అనధికార నిర్మాణాలపై కఠిన చర్యలు**
>
> కాలువల పొడువునా నిర్మించుకున్న కట్టడాలకు ఎలాంటి అనుమతులు లేవు. ఎవరికీ మా శాఖ నుంచి అనుమతులు ఇవ్వలేదు. రాత్రి రాత్రే ఆక్రమించుకుని కట్టడాలు నిర్మిస్తున్నారు. వీరికి ఆయా పంచాయతీలు విద్యుత్ శాఖ పరోక్షంగా సహకరిస్తున్నారు. పన్నులు వేయడం, విద్యుత్ మీటర్ల ఇవ్వడంతో ఆక్రమణలు తొలగించడం కష్టంగా మారింది. కాలువపై అనధికారికంగా నిర్మించిన వంతెనలు ఉంటే చర్యలు తీసుకుంటాం.
>
> – శ్రీనివాస్, డిప్యూటీ ఇంజనీర్, ఇరిగేషన్, అమలాపురం

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

అమలాపురం టౌన్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సమాఖ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా శాఖ కన్వీనర్ రవికుమార్ ఆ సంస్థ జెండాను ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యం కోసం అఖిల భారత విద్యార్థి సమాఖ్య పోరాడిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కో కన్వీనర్ వెంకట్, రామచంద్రపురం కన్వీనర్ సాయిరామ్, కొత్తపేట కన్వీనర్ సందీప్, జిల్లా నాయకులు ప్రసాద్, శ్యామ్, కమార్, రమణ, సుహాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఆవిర్భావ దినోత్సవం అనంతరం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.



అమలాపురంలో ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న నాయకులు

హిందువులపై దాడులు అమానుషం

అమలాపురం టౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న పైశాచిక దాడులకు నిరసనగా జిల్లా హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) రాష్ట్ర నాయకుడు ఓలేటి సత్యనారాయణ అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. బంగ్లాదేశ్‌లో ఓ పథకం ప్రకారం జరుగుతున్న దాడులను భారతీయులంతా ముక్త కంఠంతో ఖండించాలని ఆర్ఎస్ఎస్ నేత సత్యనారాయణ పిలుపునిచ్చి ధర్నా నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, భజరంగ దళ్ తదితర హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. చివరగా గడియారం స్తంభం సెంటరులో ఎమ్మెల్యేలతో కలిసి హిందూ చైతన్య వేదిక ప్రతినిధులు, వివిధ హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు మానవహారం నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. హిందూ చైతన్య వేదిక కన్వీనర్ యల్లమిల్లి నాగ సుధాకొండ ఆధ్వర్యంలో ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, బీజేపీ కిషాన్ మెర్చా జాతీయ నాయకుడు నల్లా పవన్‌కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్కార భారతి, బీజేపీ, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, భజరంగ దళ్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై యువతకు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న యువతకు స్వీప్– రియల్ టైమ్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ కోసం ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సోమవారం డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎమ్ ఆదర్శ్ తెలిపారు. ప్రజాస్వామ్య భావనను పటిష్టవంతం చేయడంలో భాగంగా యువత క్రమబద్ధ ఓటరు విద్య, ఎలక్టోరల్ అవేర్‌నెస్ క్యాంప్– స్వీప్ ఆశయాలు, ఓటువేసే వారిలో చైతన్యాన్ని కల్పించడం ముఖ్య ఉద్దేశ్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో సోషల్ మీడియా ఇంటర్న్, వెబ్‌డవలప్‌మెంట్ ఇంటర్న్, డేటా ఎనాలిసిస్ ఇంటర్న్ ఉన్నాయన్నారు. 6 నెలల కాలం ఉండే ఈ ఇంటర్న్‌షిప్ ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు ఉంటుందన్నారు. నెలకు రూ.10వేలు స్టైఫెండ్ ఇస్తారని ఎంపిక కమిటీ అభ్యర్థులను ఎంపిక చేస్తుందని ఆసక్తిగల యువకులు టీఐఎస్‌వైయుఆర్ఎల్.కమ్.ఎల్‌క్షన్‌పీడీవై ఇన్‌టర్న్ వెబ్‌సైట్‌లో ఈనెల 20లోగా రిజిష్టర్ చేసుకోవాలని కోరారు.

ఎల్జీని కలిసిన డీజీపీ షాలినీసింగ్

యానాం: పుదుచ్చేరి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా నూతనంగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన షాలినీసింగ్ మర్యాదపూర్వకంగా రాజ్‌నివాస్‌లో ఎల్జీ కైలాసనాథన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం సీఎం రంగసామి, హోంమంత్రి నమశ్శివాయను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

తాళ్లరేవు: తలకు శస్త్ర చికిత్స చేయించుకుని ఆర్థిక ఇబ్బందులతో ఉన్న ఉప్పంగల పంచాయతీ తెలుగోడుపాలెం గ్రామానికి చెందిన విత్తనాల అర్జమ్మకు ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కొన్ని రోజుల క్రితం జరిగిన యాక్సిడెంట్‌లో అర్జమ్మ తలకు తీవ్రగాయాలు కావడంతో తలకు శస్త్ర చికిత్స చేశారు. మరొక్కసారి శస్త్ర చికిత్స చేయించాలని రూ.2 లక్షలకు పైగా ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చెందుతున్నారు. దాతలెవరైనా సహాయం అందించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న శివన్నారాయణ స్వయంగా వెళ్లి పరామర్శించి రూ.10 వేలు అందజేశారు. మాజీ సర్పంచ్ ఎం.శ్రీనివాస్, సీహెచ్ రాజు, ఎం.కృష్ణంరాజు, శ్రీనివాస్, సత్యన్నారాయణ, ఏడుకొండలు, వాడపల్లి, వెంకటరమణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి

ముమ్మిడివరం: మారుమూల ప్రాంతాలకు సైతం తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీపీ కోలా గంగాభవానీ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పలు శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా రక్షిత మంచినీటి సరఫరా పథకం జేఈ నానాజీ రావు జల జీవన్ మిషన్ జేజేఎం ద్వారా చేపట్టిన పనులు చాలా వరకు పూర్తి చేశామని వివరించగా అయినాపురం సర్పంచ్ మోకా రామారావు అభ్యంతరం వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలో రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి పైపులైన్లు వేసి ప్రారంభోత్సవం చేసి ఎనిమిది నెలలు గడిచినా చుక్క నీరు రాలేదని మండి పడ్డారు. ఓవర్ హెడ్ ట్యాంకులో నీరు నింపి నీటిని సరఫరా చేసేందుకు అవసరమైన ఫోర్ గేటు వాల్వ్‌లను అమర్చకుండా తాత్సారం చేస్తున్నారని అన్నారు. పనులు పూర్తి చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటింటికీ వేసిన పైపులైన్లకు దిమ్మలు నిర్మించక పోవడంతో సుమారు పైపులైన్లు, ట్యాప్‌లు చోరీకి గురవుతున్నాయని ఆరోపించారు. ఎంపీటీసీ సభ్యుడు మట్టపర్తి సురేష్ మాట్లాడుతూ ఓఎన్‌జీసీ సీసీఆర్ నిధులు రూ.41 లక్షలతో పెద మెట్టలంకలో ట్యాంకు నిర్మించినా పైపులైన్ వేయలేదని ఆరోపించారు. వ్యవసాయ శాఖ ప్రగతిని ఏఓ ప్రశాంత కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యాశాఖాధికారి బొజ్జా రమణశ్రీతోపాటు వివిధ శాఖాధికారులు తమ శాఖల పనితీరును వివరించారు. ఈసమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శివశంకరరావు, తహసీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, ఎంపీడీఓ నరసింహారావు వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోలా గంగాభవాని

కట్టు కాలువలో దిగిన యువకుడి మృతి



సందీప్ (ఫైల్)

ఉప్పలగుప్తం: పొట్టకూటి కోసం విదేశాలకు వెళ్లిన తల్లిదండ్రులకు కడుపు కోత మిగిలింది. చదువు నిమిత్తం దూరప్రాంతాలకు వెళ్లే లోపు చిన్ననాటి స్నేహితులతో సరదాగా గడపాలనుకున్న ఆ యువకుడికి విధి స్నేహితుల నుంచి శాస్వతంగా తిరుగురాని లోకాలకు తీసుకుని వెళ్లింది. వివరాల్లోకి వెళితే ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం బీచ్ సమీపాన కట్టు కాలువలో ప్రమాదవశాత్తు మునిగి విద్యార్థి మృతి చెందిన సంఘటన ఇది. ఎస్సై కె.మనోహరజోషి కథనం ప్రకారం గన్నవరం మండలం పెదకందాలపాలెంకు చెందిన సిఖిలే సందీప్ (17) తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లటంతో అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడిలో అన్నయ్య గౌతమ్‌తో కలిసి అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నారు. సందీప్‌కు విశాఖపట్నం కాలేజీలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదివేందుకు సీటు వచ్చింది. వారం రోజుల్లో కాలేజీలో చేరేందుకు వెళుతుండటంతో సోమవారం సందీప్ అతని అన్నయ్యతోపాటు స్నేహితులతో కలిసి సరదాగా గడపాలని ఎస్.యానం బీచ్ వెళ్లి సముద్రంలో స్నానాలు చేశారు. అనంతరం బీచ్‌ను ఆనుకుని ఉన్న కట్టు కాలువలో కాళ్లు కడుగుకునేందుకు సందీప్ దిగాడు. ప్రమాదవశాత్తు నీటి ప్రవాహానికి సందీప్ కాలువలో కొట్టుకుపోయాడు. దీంతో సందీప్ అన్నయ్య గౌతమ్ స్నేహితులు బిగ్గరగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న స్థానిక మత్స్యకారులు సందీప్‌ని కాపాడేందుకు వలలు వేసి పైకి తీసుకొచ్చారు. స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పరీక్షించి అప్పటికే సందీప్ మృతి చెందాడని తెలిపారు. మృతిని సోదరుడు గౌతమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై తెలిపారు.

సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

తాళ్లరేవు: పంచాయతీల ద్వారా అందించే సేవలకు సంబంధించి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు (గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5) మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ రాయుడు సునీత ప్రారంభించారు. ఆర్‌జీఎస్ఏ కార్యాచరణ, ప్రణాళిక–రిఫ్రెషర్స్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, జీపీడీపీ, స్వ్యూటీ, స్ట్రీట్‌లైట్స్ నిర్వహణ తదితర అంశాలపై మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీపీ తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. ముఖ్యమైన అధికారులు ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ లేకుండా శిక్షణ ఏమిటని పలువురు సర్పంచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఉప్పలగుప్తంలో శిక్షణ తరగతులు

ఉప్పలగుప్తం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని 17 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మరో మూడు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. పంచాయతీలో విధులు, నిధుల వినియోగంపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా సర్పంచ్‌లకు వివరించారు. శిక్షణను కార్యదర్శులు బి.అనిత, దాసరి కృష్ణాజీ, వి.వి.వి.సత్యనారాయణలు ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎంపీడీవో కె.వి.ప్రసాద్, ఏఓ ఎంఎల్ఎస్ మూర్తి పాల్గొన్నారు.



ఉప్పలగుప్తం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి

బాలోత్సవంలో బహుమతుల పంట



బాలోత్సవంలో బహుమతులు సాధించిన పాలగుమ్మి విద్యార్థులు

అమలాపురం రూరల్: కొత్తపేట బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్వహించిన కోనసీమ బాలోత్సవం మొదటి పిల్లల పండుగలో మండలంలో పాలగుమ్మి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభచూపి బహుమతులు అందుకున్నారు. ఏకపాత్రాభినయం సీనియర్స్ విభాగంలో డి.రీనా అలేఖ్య ద్వితీయ బహుమతి, క్విజ్ సీనియర్స్ విభాగంలో కే. మోహిత లక్ష్మీసౌమ్య, జి.రూపేష్ కుమార్ తృతీయ బహుమతులుగా బంగారు పతకాలు సాధించారు. మట్టితో బొమ్మలు చేయడం జూనియర్స్ విభాగంలో వి. ధన పవన్ కుమార్, జానపద నృత్యం జూనియర్స్ విభాగంలో ఏ. జాహ్నవి, ఎస్.గీతా మాధురి, జి. శ్రీమహాలక్ష్మి, ఏ.భాను, ఎం జ్యోత్స్న, ఎం.రిషిత శ్రావ్య, ఆర్.డి. అనుష్య బృందం తృతీయ బహుమతి సాధించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందం, ప్రముఖ శిల్పి రాజ్ కుమార్ వడయార్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు కర్రి కాశీ విశ్వనాథం చేతులమీదుగా విజేతలు బహుమతులు అందుకున్నారు. విద్యార్థులను హెచ్‌ఎం గుంట్రు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

చిన్నారులకు ఆధ్యాత్మిక పోటీలు

అమలాపురం టౌన్: రానున్న శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) అమలాపురం శాఖ ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో విద్యార్థులకు సోమవారం పలు ఆధ్మాతిక పోటీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం ఇస్కాన్ చైర్మన్ శివానంద నిమయి దాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో దాదాపు 400 మంది విద్యార్థులు పాల్గొని భగవద్గీత శ్లోకాలు, చిత్ర లేఖన పోటీల్లో ప్రతిభ చాటారు. 1 నుంచి 5వ తరగతి వరకూ ఒక విభాగం, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ మరో విభాగం ద్వారా పోటీలు నిర్వహించారు. భగవద్గీత 12,15 అధ్యాయాల నుంచి శ్లోకాలను చిన్నారులు అనర్గళంగా పలికి ఔరా అనిపించారు. శ్రీకృష్ణుడు ప్రధాన అంశంగా బాల బాలికలు చిత్ర లేఖన పోటీల్లో తమ ప్రతిభను చాటారు. పలు కోణాల్లో శ్రీకృష్ణుడి దృశ్యాలను చిన్నారులు తమ చిత్ర లేఖనం ద్వారా రూప కల్పన చేశారు. పోటీల్లో పాల్గొన్న 400 మంది బాల బాలికలకు సర్టిఫికెట్లు ఇస్కాన్ అందజేసింది. విజేతలకు శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున అమలాపురం రూరల్ మండలం జనుపల్లిలోని ఇస్కాన్ కేంద్రంలో అందజేస్తామని శివానంద నిమయి దాస్ వెల్లడించారు. ఇస్కాన్ సండే స్కూలు టీచర్ మేడిది సత్య కళ, సామాజిక సేవకరాలు పూజా జైన్, ఇస్కాన్ మేనేజర్ శ్యామ్, సత్యధర్మదాస్ నేతృత్వంలో పోటీలు నిర్వహించారు.

వితంతువులకు రక్షణగా ప్రత్యేక చట్టాలు

ముమ్మిడివరం: వితంతువుల రక్షణకు ప్రత్యేక చట్టాలున్నాయని, వారిని ఇబ్బందులకు గురి చేస్తే నిందితులు కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా పేర్కొన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగర పంచాయతీ ఆవరణలో వితంతు పింఛన్లపై నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పెన్షన్ ప్రయోజనం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వితంతువులకు మాత్రమే పెన్షన్ అందుబాటులో ఉంటుందన్నారు. వితంతువుల వయస్సు 18 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండి. భర్త మరణించిన తర్వాత మరొక వ్యక్తిని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్న వారు పెన్షన్‌కు అర్హులు కాదన్నారు. వితంతువులు ఏదొక వృత్తి నేర్చుకుని దానిలో నైపుణ్యం పెంపొందించుకుని మనో ధైర్యంతో జీవించాలని సూచించారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, రామాయణం మనేశ్వరరావు, పీవీ చక్రవర్తి, ఎస్సై జ్వాలా సాగర్, మున్సిపల్ సిబ్బంది. మహిళా పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రహంతుల్లా

వెయ్యి జాతీయ జెండాలు అందజేత

అమలాపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం రోజైన ఆగష్టు 15న పట్టణంలోని ప్రతి ఆర్య వైశ్యుని ఇంటి పైనా జాతీయ జెండా ఎగిరేలా ఎవరికి వారు ముందుకు రావాలని అమలాపురం పట్టణ వైశ్య సంఘం పిలుపునిచ్చింది. ఆ రోజు ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగుర వేసి దేశ భక్తిని చాటాలని వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఆ రోజు ఆర్య వైశ్యులు విధిగా జాతీయ జెండా ఎగుర వేసేలా సంఘ ప్రతినిధి కాళ్లకూరి కుమార్ వెయ్యి జెండాలను సమకూర్చారు. ఈ జెండాలను స్థానిక వాసవీ కల్యాణ మండపంలో వైశ్య సంఘ ప్రతినిధులకు ఆయన సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ వైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు యెండూరి వెంకట్రామయ్య, కార్యదర్శి నంబూరి నరేష్, సంఘ ప్రతినిధులు వంకాయల కాశి, వరదా సూరిబాబు, నందిపాటి శ్రీనివాస్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్య వైశ్య మహా సభ మహిళా అధ్యక్షురాలు యెండూరి సీత పాల్గొన్నారు.



దాత సమకూర్చిన జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న పట్టణ ఆర్య వైశ్య సంఘ ప్రతినిధులు

13న హర్‌ఘర్ తిరంగా భారీ ర్యాలీ

యానాం: దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయజెండా ప్రాముఖ్యతను అందరికీ తెలిసేలా ఈనెల 13న పట్టణంలో హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు సోమవారం ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. ఈ ర్యాలీలో వివిధ పాఠశాలలు, కాలేజీల విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఆపద మిత్ర బృందాలు, స్వయం సహాయ సంఘాల సభ్యులు, ఫీల్డ్‌స్టాఫ్‌తో పాటు వివిధ శాఖలు ఆరోగ్య, ఉమెన్ అండ్ చైల్డ్ డవలప్‌మెంట్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖలు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. ఆరోజు సాయంత్రం 4 గంటల నుంచి ఆర్ఏఓ ఆఫీసు నుంచి ర్యాలీ మొదలై ఆర్ఏఓ ఆఫీసు వద్ద ముగుస్తుందని తెలిపారు. ఈనెల 15నుంచి 16 వరకు ప్రజలు తమ గృహాల పైన జాతీయజెండాను ఎగురువేసుకోవచ్చన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

యానాం: యానాం నియోజకవర్గ శివారు దరియాల తిప్పలో అల్లూరి సీతారామరాజు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ సోమవారం స్థానిక విలేజ్ హెడ్‌మేన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కమిడి బాలయోగి, జనరల్ సెక్రటరీ సబ్బతి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో ప్రాథమిక తరగతులైన 1,2 తరగతులకు సంబంధించి రెండేళ్లుగా ఒకరే టీచర్ బోధిస్తున్నారని దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాఠశాలలో అదనంగా మరో ఉపాధ్యాయుడ్ని, క్లీనింగ్ స్టాఫ్‌ను నియమించాలని కోరారు.